ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 24.0

ANDHRAJYOTHY

సూర్యాపేట

5

మంగళవారం 13 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.80 (308.4658)	68,211	47,035
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.84 (3.65)	961.10	512.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	169.42 (37.54)	నిల్	12,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.180



పరిపడా గదులు లేని కోదాడ దోరకుంట సమీపంలోని గురుకుల పాఠశాల

గురుకులాల్లో సమస్యల తిష్ఠ

పేద విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. కొన్ని గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో సౌకర్యాలు లేకపోవడంతో అసౌకర్యాల నడుమ విద్యాబోధన సాగుతోంది.

- (ఆంధ్రజ్యోతి,సూర్యాపేట)

ఇటీవల కాలంలో గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. వారి సంఖ్యకు అనుగుణంగా గురుకుల పాఠశాలల్లో వసతులు కరువయ్యాయి. ఇరుకు గదులు,సరిపడా లేని మరుగుదొడ్లు, నీటి సమస్య, వెలుతురు లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా విద్యార్థులకు ఆట స్థలాలు కరువయ్యాయి. పలుపాఠశాలల్లో ప్రహరీలు లేకపోవడంతో రాత్రివేళ పాములు వస్తున్నాయి. కొంత మంది విద్యార్థులు సౌకర్యాలు లేని కారణంగా విద్యకు దూరమవుతున్నారు. జిల్లాలో బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీ గురుకులాలు మొత్తం 89 వరకు ఉన్నాయి.

ఉడికీ ఉడకని అన్నం

హాస్టల్‌లో అందిస్తున్న అన్నం తినలేకపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అన్నం ఉడకడం లేదని, మొత్తం నీరు, ముద్దగా ఉంటోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌కు సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, తమకు మాత్రం రేషన్ బియ్యం వండిపెడుతున్నారని, అన్నం తినే పరిస్థితి లేదని వారు వాపోతున్నారు.



ఆత్మకూర్(ఎస్) మండలంలోని గురుకులంలో ధ్వంసమైన కిటికీలు

సమస్యలతో సావాసం

గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. జిల్లాలోని గురుకులాల్లో మొత్తం 6,127 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీటిలో కొన్ని గురుకుల విద్యాలయాలలు అద్దె భవనాలో అసౌకర్యాల నడుమ సాగుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా గదు లు లేవు. పాఠశాలల్లో మరుగుదొడ్ల సంఖ్య తక్కువగా ఉంది. తాగునీటిని సమస్య వెంటాడుతోంది. జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల్లో నీటి సమస్య ఏర్పడింది. కొన్ని హాస్టళ్లలో కంప చెట్లు, పిచ్చిచెట్లు పెరిగి విషపురుగులతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని గురుకులంలో సుమారు 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా, వర్షాకాలం వచ్చిందంటే చుట్టూ వరద నిలిచి మురుగు కూపంలా మారుతోంది. కిటీకీలు సరిగా లేక వర్షం జల్లు లోనికి వస్తోంది. మరుగుదొడ్లు సరిగా లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. మోతె మండలంలో కస్తూర్బా హాస్టల్‌లో కిటీకీలు ధ్వంసమై చలికాలం వస్తే విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పెన్‌పహాడ్ మండలంలో హాస్టల్‌లో ఇటీవల ఇద్దరు విద్యార్థులను ఎలుకలు కరవడంతో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సూర్యాపేట మండలంలోని ఇమాంపేట, బాలెంల గ్రామాల్లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మహిళా కళాశాలలు ఉన్నాయి. ఈ గురుకులాల్లో గతంలో వరుస వివాదాస్పద ఘటనలు చోటుచేసుకున్నాయి. ఇమాంపేట గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. బాలెంల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థులు వరుస ఆందోళనలు చేయడం కూడా రాష్ట్రంలో వివాదాస్పదమైంది.



అన్నం సరిగా ఉండటం లేదు

హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం సరిగా లేదు. ఇటీవల ప్రభుత్వం కొత్త బియ్యం ఇవ్వడంతో అన్నం సరిగా ఉడకకుండా ముద్దగా, తడిగా ఉంటోంది. హాస్టల్‌కు పాత బియ్యం సరఫరా చేయాలి.

- దిలీప్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కోదాడ



ఆహారం నాణ్యంగా ఉండటం లేదు

విద్యార్థులకు అందిస్తున్న ఆహారం బాగా ఉండటంలేదని హాస్టల్‌లో చదువుతున్న నా ఇద్దరు కుమారులు చెప్పారు. ప్రభుత్వం సన్నబియ్యం స్థానంలో రేషన్ బియ్యం సరఫరా చేసింది. వాటిని తినలేక విద్యార్థులు ఇబ్బందిపడతున్నారు. వెంటనే పాత బియ్యం సరఫరా చేయాలి.

- ప్రసాద్, గణపారం, విద్యార్థి తండ్రి

- అసౌకర్యాల నడుమ విద్యాబోధన
- పక్కా భవనాలకు లేకపోవడమే ప్రధాన కారణం
- అనారోగ్యాలకు గురవుతున్న విద్యార్థులు

సమస్యల వలయంలో గురుకుల పాఠశాల

కోదాడరూరల్: మండలంలోని దోరకుంట సమీపంలోని పులిచింతల పునరావాస కేంద్రం నెమలిపురి కాలనీలో ఏర్పాటుచేసిన సాంఘిక సంక్షేమశాఖ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల కిందట ఈ గురుకుల పాఠశాల మునగాల మండలానికి మంజూరు కాగా, అక్కడ స్థలం లేక కోదాడ మండలం పరిధిలోని దోరకుంట సమీపంలోని నెమలిపురి పునరావాస కేంద్రంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ హైస్కూల్ కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉండటంతో స్థలం కూడా సుమారు 20ఎకరాల విస్తీర్ణం ఉండటంతో ఇక్కడికి గురుకులాన్నిమార్చారు. అయితే ఇక్కడ సరిపడా తరగతి గదులు లేక తరగతి గదిలోనే విద్యార్థులు నిద్రించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తం 530 మంది విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్ సెకండరీ ఇక్కడ విద్యాభ్యాసం చేస్తున్నారు. కంప్యూటర్, ల్యాబ్‌కు ప్రత్యేక గదులు లేకపోవటంతో విద్యార్థులకు కంప్యూటర్ విద్య దూరమైంది. రెండేళ్ల కిందట నాబార్డు సహాయంతో రూ.1కోట్లతో ఐదు తరగతి గదులు నిర్మించారు. వాటిని నేటికీ ప్రారంభించలేదు. ఇంటర్‌లో ఇక్కడ ఒక్క ఎంపీసీ మినహా ఇతర గ్రూపులు లేవు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

గురుకులాల డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్

తుంగతుర్తి, ఆగస్టు 12: గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని గురుకులాల డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. అనంతరం పాఠశాల డార్మెటరీ, తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. గదుల్లో ఫ్యాన్లు లేవని, భోజనంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రస్తుతం గెస్ట్ టీచర్లతో విద్యాబోధన కొనసాగిస్తున్నామని తెలిపారు. త్వరలో పాఠశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌ను నియమిస్తామని చెప్పారు. ఆయన వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ, తదితరులు ఉన్నారు.



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రసాద్



సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి సమీపంలో సద్దుల చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

నిరుపయోగంగా.. క్రీడా ప్రాంగణాలు

- ఉన్నచోటనే మట్టిపోసి నిధులు డ్రా చేసిన వైనం
- జిల్లాలో 436 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు
- ఐదు మునిసిపాలిటీల్లో 17 చోట్ల ఏర్పాటు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 12: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారిని జాతీయ, అంతర్జాతీయస్థాయికి తీర్చిదిద్దాలని కేంద్ర ప్రభుత్వం గ్రామాలు, పట్టణాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేసింది. అందుకు జాతీయ ఉపాధిహామి పథకం నుంచి నిధులు మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని గ్రామాలు, ఆవాసాలు, పట్టణాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటయ్యాయి. అయితే ప్రభుత్వం లక్ష్యం అనుకున్న స్థాయిలో నెరవేరలేదు. కోట్లలో నిధులు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు, పట్టణాల్లో రూ.6లక్షల వరకు ఖర్చు చేయగా, ప్రస్తుతం అవి వృథాగా దర్శనమిస్తున్నాయి.

436 క్రీడా ప్రాంగణాలు

జిల్లాలోని 475 గ్రామాలతో పాటు వాటి ఆవాస గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే గ్రామాల్లో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలు లభించలేదు. జిల్లాలో మొత్తం 613 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, స్థలాల సమస్య కారణంగా 436 చోట్ల మాత్రమే ఏర్పాటుచేశారు. అదేవిధంగా జిల్లాలోని ఐదు మునిసిపాలిటీల పరిధిలో 17 ప్రాంతాల్లో క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. సూర్యాపేట మునిసిపాలిటీలో ఆరు, కోదాడలో నాలుగు, తిరుమలగిరి, నేరేడుచర్లలో రెండు చొప్పున, హుజూర్‌నగర్‌లో మూడు క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు.



తిరుమలగిరి మునిసిపాలిటీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

నిధులు వృథా

జిల్లాలో కోట్ల రూపాయల నిధులతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేయగా, ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉండటంతో నిధులు వృథా అయ్యాయి. గతంలో ఉన్న క్రీడా మైదానాల్లో మట్టి పోసి నిధులు డ్రా చేశారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రామాల శివారున క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఉపయోగం లేని చోట మట్టిపోసి వాలీబాల్ ఆడేందుకు అవసరమైన స్తంభాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రన్నింగ్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, యువత కసరత్తులు చేసేందుకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేయాలి. కానీ, దానికి విరుద్ధంగా క్రీడాప్రాంగణాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఇదివరకే క్రీడా మైదానాలు ఉండగా, అక్కడే తూతూమంత్రంగా మట్టిపోసి బోర్డులు ఏర్పాటు చేసి నిధులు డ్రా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్

హుజూర్‌నగర్, ఆగస్టు 12 : క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగుపడతాయని హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందన్నారు. న్యాయవాదులు అందరితో కలిసి క్రీడలు నిర్వహించడం గర్వకారణమన్నారు. నిత్యం పనిఒత్తిడితో ఉండే న్యాయవాదులకు పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి, జక్కుల వీరయ్య, కాలువ శ్రీనివాసు, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, నగేష్‌రాథోడ్, సుందరరాఘవరావు, మామిడి వెంకయ్య పాల్గొన్నారు.

నాలుగు నెలలుగా నీళ్లు రావడంలేవు



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తుంగతుర్తి, ఆగస్టు 12 : నాలుగు నెలలుగా తమ వార్డులోకి నీళ్ల రాక ఇబ్బందులు పడుతున్నామని తుంగతుర్తి మండల కేంద్రంలోని నాలుగో వార్డు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి కోట రామస్వామి మాట్లాడుతూ సుమారుగా కాలనీలో 50 కుటుంబాలకు పైగా జీవిస్తున్నాయని, నాలుగు నెలలుగా నీళ్ల రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీళ్ల కష్టాలపై అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఖాళీ బిందెలతో నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. అనంతరం తహసీల్దార్ కంఠమయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యదర్శి శ్రీనివాస్‌ను అడిగి సమస్య పరిష్కరిస్తానని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో కాలనీమహిళలు త్రివేణి,నాగమ్మ,సోమలక్ష్మి, వెంకన్న,రజిత పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు: డీఈ నగేష్

మోతె, ఆగస్టు 12 : ఎస్సారెస్పీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సారెస్పీ డీఈ నగేష్ అన్నారు. సోమవారం మండలంలోని రామాపురంతండా, ఉర్లుగొండ, విభాలపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని ఎల్ఎస్-22 కాల్వ వెంట ఆక్రమిత భూములను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ కాల్వ భూములను ఆక్రమించారని, రామాపురంతండా గ్రామస్తులు ఫిర్యాదు చేశారన్నారు. కాల్వ భూమితో పాటు బాటసారులు నడిచే భూమి లేకుండా ఆక్రమించారని అన్నారు. ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రభుత్వం కాల్వ కోసం కొనుగోలు చేసిన భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 12 : మండల ప్రత్యేకాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, పర్యటన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, మాట్లాడారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను బయోమెట్రిక్ హాజరులో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్, ఎంపీడీవోలతో టీంలు ఏర్పాటుచేసి వారికి శిక్షణ ఇప్పిస్తామన్నారు. తహసీల్దార్లు ప్రభుత్వ భూముల వివరాలను తెలియచేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఏర్పాటు చేసే శకటాలు, స్టాల్స్ వివరాలతో పాటు అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన వివరాలను వెంటనే అందించాలన్నారు. అనంతరం దివ్యాంగులైన బైరెడ్డి పార్వతమ్మ, ఐతగాని రామానుజమ్మ నడవడానికి ఇబ్బందులు పడుతుండగా వారికి జిల్లా సంక్షేమాధికారి నర్సింహారావు ద్వారా సపోర్టు కర్రలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీపీవో యాదగిరి, డీఎంహెచ్‌వో డాక్టర్ కోటా చలం, జిల్లా సంక్షేమాధికారులు శంకర్, నర్సింహారావు, లత, డీఈవో అశోక్ పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్




మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డిని కలిసిన రాజీవ్‌జ్యోతియాత్ర నిర్వాహకులు

సూర్యాపేట టౌన్, ఆగస్టు 12 : దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11వ తేదీన తమిళనాడులో ప్రారంభమైన రాజీవ్‌గాంధీ జ్యోతి సద్భావన యాత్ర సోమవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. జమ్మిగడ్డలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఈ యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ తమిళనాడు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర 10 రాష్ట్రాల కలుపుకొని మూడు వేల కిలోమీటర్లు కొనసాగి న్యూఢిల్లీలోని రాజీవ్ స్మారక స్థలం వీర్‌భూమికి చేరుకుంటుందన్నారు. గత 33 ఏళ్ల నుంచి ప్రతీ ఏడాది యాత్ర కొనసాగడం గొప్ప విషయమన్నారు. దేశ సమగ్రతకు, అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో యాత్ర నిర్వాహకులు శ్యామ్యూల్, నాయకులు పోతు భాస్కర్, చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, బైరు శైలేందర్‌గౌడ్, అబ్దుల్ రహీం, వీరన్ననాయక్, కందాల వెంకట్‌రెడ్డి, ఎలిమినేటి అభినయ్, గండూరి రమేష్, కుంభం రాజేందర్, చెంచల శ్రీనివాస్, ఆలేటి మాణిక్యం, నాగుల వాసు, రుద్రంగి రవి, అక్కెనపల్లి జానయ్య, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, కుందమల్ల శేఖర్, గడ్డం వెంకన్న, రావుల రాంబాబు, ఆరెంపుల రాజు, గాజుల రాంబాయమ్మ, ఇస్రార్ అహ్మద్, నర్సిరెడ్డి, పచ్చిపాల వెంకన్న, శిగ శ్రీనివాస్, నిఖిల్, నరేందర్‌నాయుడు, ఏలగందుల సాయి నేత పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 12 : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో సోమవారం నిత్యకల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తవత్సలుడైన స్వామివారికి నిజాభిషేకం, నిత్యార్చనలు జరిపారు. అనంతరం ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు కొనసాగాయి. ఉదయం హోమాదికాలను పూర్తిచేశారు. తదుపరి కల్యాణమూర్తులకు పుణ్యాహవాచనం చేశారు. యజ్ఞోపవీత ధారణ, మాంగళ్యధారణ అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం వేదపండితులు ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషార్చనలు కొనసాగాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యకల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, కొండపైన పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామివారికి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్యకైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాతసేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలిపూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహిం చారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమ శాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.17,71,886 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

భక్తుల రక్షణ కోసం షెడ్డు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కొండపై ఎండ, వాన నుంచి భక్తుల రక్షణ కోసం జర్మన్ టెక్నాలజీ హ్యాంగర్ ఫ్యాబ్రిక్ షెడ్డు అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు ఆదివారం రాత్రి నుంచి ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించి తెల్లవారుజాము వరకు పూర్తిచేశారు. ఆలయ అందాలకు అడ్డుగా ఉందనే అభిప్రాయాల మేరకు ఉత్తర రాజగోపురం తర్వాత నిర్మించిన ఈ షెడ్డుతో భక్తులకు ఎంతో కొంత నీడ లభించడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత ఇంకా తగ్గకపోవడం, అకస్మాత్తుగా కురిసే వర్షానికి భక్తులు తలదాచుకునే చోటులేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు తిరిగి ఆలయ ఉత్తర తిరుమాఢ వీధుల్లో భారీషెడ్డును అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఈ షెడ్డు ఏర్పాటుతో ఆలయ సహజత్వం, అందాలకు అడ్డుగా మారిందని కొంత మంది భక్తుల నుంచి విమర్శలు రాగా రథశాల ముందు గ్రీనరీ భాగం నుంచి రిటైనింగ్ వాల్ వెంట నేరుగా కొండ కింది వైకుంఠ ద్వారం వరకు శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. దీని వెంట వేసవిలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయగా ఇందుకోసం రిటైనింగ్ వాల్ వెంట ఉన్న చెట్లను కూడా తొలగించారు. త్వరలో ప్రతిపాదనలు మోక్షం కలగనుండగా అప్పటి వరకు భక్తులు సేద తీరేందుకు తిరిగి షెడ్డు అందుబాటులోకి తెచ్చినట్లు సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి తెలిపారు.



శివాలయంలో స్ఫటికలింగానికి హారతిఇస్తున్న అర్చకుడు


ఖమ్మం నుంచి భక్తుడి పాదయాత్ర

రేవంత్‌రెడ్డి సీఎంగా అధికారం చేపట్టినందుకు ఖమ్మం జిల్లాకు చెందిన ఎర్రనాగుల రమేష్‌నాయక్ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం నుంచి పాదయాత్ర ప్రారంభించి సోమవారం యాదగిరిగుట్టకు చేరుకొని వైకుంఠ ద్వారం(స్వామివారి పాదాలు) చెంత సీఎం చిత్రపటంతో మొక్కు తీర్చుకున్నాడు. అనంతరం కొండపైన శ్రీస్వామిఅమ్మవార్లను దర్శించుకొని పూజలు చేపట్టి మొక్కు తీర్చుకున్నాడు. వంద రోజుల దీక్షలో భాగంగా శాకాహార భోజన నియమాలతో క్షేత్ర సందర్శన చేసినట్లు భక్తుడు తెలిపారు. మరో ఐదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రేవంత్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని ఏకశిఖరవాసుడిని కోరుకున్నట్లు తెలిపాడు.

దేవస్థానం పాలకమండలి నియమించాలి

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి సంబంధించి పాలకమండలిని నియమించాలని భాగ్యనగర్ అర్చక, పురోహిత సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను కోరారు. సోమవారం యాదగిరిగుట్టలో అయిలయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్లుగా ఆలయాల్లో పాలకమండలి నియామకం జరగలేదని, పాలకమండలిని నియమించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉడుత యాదగిరి, నలుబాల ఎర్రయ్య ఉన్నారు.















కదిలిన యంత్రాంగం

- ఎర్రబెల్లి, గోపాలపురం గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు
- జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరణ
- పారిశుధ్య లోపమే కారణమని అధికారుల వెల్లడి



నిడమనూరు: ఎర్రబెల్లిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది



హుజూర్‌నగర్: గోపాలపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిడమనూరు, హుజూర్‌నగర్, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా నిడమానూరు మండలంలోని ఎర్రబెల్లి, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురం గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న బాధితుల కోసం ఆయా జిల్లాల వైద్యాధికారులు కదిలారు. 'నిడమనూరుకు జ్వరమొచ్చింది' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎర్రబెల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 330 ఇళ్లకు వెళ్లి జ్వరాలపై సర్వే చేశారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురి నుంచి రక్త నమూనాలు కూడా సేకరించారు. సాధారణ జ్వరాలే అని నిర్ధారించారు. జ్వరాలు వ్యాపించడానికి గల కారణాలు వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్య సిబ్బందితో పర్యటించి నీటిని పరిశీలించారు. నిల్వ ఉన్న నీటిలో లార్వాను అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వదిలారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో దోమల నివారణ కోసం తరచూ ఫాగింగ్ చేయాలని నల్లగొండ జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో కేశ రవి అధికారులకు సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పారిశుధ్యం లోపించడం కారణంగానే జ్వరాలు వస్తున్నాయని, సీజనల్ వ్యాధులు రావడం సహజమేనన్నారు. సాధారణ జ్వరాలేనని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసం లేదన్నారు. జ్వరాలు పూర్తిగా నివారించేందుకు వైద్య శిబిరాలు కొనసాగించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రఫి, సీహెచ్‌వో రమేష్, హెచ్‌ఈవోలు ప్రభాకర్, వాసుదేవరెడ్డి, పీహెచ్‌ఎన్ రజిని, గంటా సోమయ్య, జోసెఫ్, మంజుల, సుచిత్ర, స్వప్న, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గోపాలపురంలో తొమ్మిది బృందాలతో సర్వే

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని గోపాలపురంలో జిల్లా వైద్యశాఖాధికారులు తొమ్మిది బృందాలు గ్రామంలో ఇంటింటి సర్వే చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో నిరంజన్ మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు వస్తాయని, వాటిని దరిచేరనీయవద్దన్నారు. గృహ పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మలేరియా, చికున్‌గున్యా, డెంగ్యీ, టైఫాయిడ్ లాంటి విష జ్వరాలు ఒకరి నుంచి ఒకరికి వస్తాయన్నారు. కలుషితమైన ఆహారపదార్థాలు, ఈగలు, దోమలు వాలిన ఆహారాలు తినడం వల్ల కూడా ఈ వ్యాధులు వస్తాయన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ వేడివేడి ఆహార పదార్థాలు తినాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. విషజ్వరాలు అదుపులో ఉన్నాయన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణి, పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నల్లబండగూడెం, అమీనాబాద్‌లో ఫీవర్ సర్వే

కోదాడ రూరల్, అనంతగిరి: కోదాడ మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల నల్లబండగూడెం గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ఆరోగ్య సిబ్బంది సోమవారం ఇంటింటికీ తిరిగి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో ఉపేందర్, పీహెచ్‌ఎన్ అనంతలక్ష్మి, సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, యాతాకుల మధుబాబు పాల్గొన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతన్న దృష్ట్యా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో ఉన్న రోగులను గుర్తించి రక్త నమూనాలను సేకరించారు.

'సాగర్' క్రస్ట్ గేట్లు మూసివేత

- ఎనిమిది రోజుల్లో 174.82 టీఎంసీల నీటి విడుదల



మూసి ఉన్న నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు గేట్లు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 12: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మూసివేశారు. సాగర్‌కు ఎగువనుంచి వరద రాక తగ్గడంతో క్రస్ట్ గేట్లను మూసివేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కృష్ణాబేసిన్‌లో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండడంతో సాగర్‌కు జూలై 29వ తేదీ నుంచి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద రాక మొదలైంది. దీంతో సాగర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరువ కావడంతో ఈ నెల 5వ తేదీన క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మొత్తం ఎనిమిది రోజుల్లో క్రస్ట్ గేట్ల ద్వారా 174.82 టీఎంసీల నీటిని సాగర్ నుంచి దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. దీంతో సాగర్ నుంచి ఎనిమిది రోజుల్లో మొత్తం 174.82 టీఎంసీల నీరు కడలి పాలైంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు (215.6070 టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువనుంచి 77,598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో సోమవారం సాయంత్రానికి శ్రీశైలం నీటి మట్టం 881.20 అడుగులుగా(194.3096టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,211 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050 టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 588.80 అడుగులుగా(308.4658టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,253 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,541 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,841 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,035 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 68,211 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది. ఈ నెల 5వ తేదీన సాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు విడుదల చేయడంతో ఎనిమిది రోజుల పాటు పర్యాటకుల సందడి నెలకొంది. సోమవారం గేట్లన్నీ మూసివేయడంతో పర్యాటకులు లేక సాగర్ పరిసర ప్రాంతాలు బోసిపోయి కనిపించాయి.

'మూసీ'కి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో.. గేట్లు మూసివేత

మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మూసీ నది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద నీరు దిగువన గల ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో ఆదివారం సాయంత్రానికి 731.24క్యూసెక్కులు ఉండగా, సోమవారం సాయంత్రానికి కొంత మేరతగ్గి 961.10క్యూసెక్కులుగా నమోదైంది. 645అడుగుల(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 641.84అడుగులుగా (3.65టీఎంసీ) ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి కాల్వకు 256.21 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 256.21 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

'పులిచింతల' ప్రాజెక్టుకు ఆగిన వరద

ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని పులిచింతల ప్రాజెక్టుకు ఎగువనుంచి వరద నిలిచిపోవటంతో సోమవారం సాయంత్రం ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175అడుగులు(45.77 టీఎంసీలు)గా కాగా, సోమవారం సాయంత్రానికి 169.42 అడుగులుగా(37.54 టీఎంసీలు) నమోదైంది. తెలంగాణ జెన్కో జల విద్యుత్ కేంద్రానికి 12వేల క్యూసెక్కుల వరద నీటిని వినియోగిస్తూ, నాలుగు యూనిట్ల ద్వారా 80మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 12వేల క్యూసెక్కులు కాగా, ఎటువంటి ఇన్‌ఫ్లో లేదు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటికి తెస్తున్న గ్రామస్థులు

చిలుకూరు, గరిడేపల్లి, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా చిలుకూరు మండలంలోని పోలేనిగూడెం పరిధిలో గల సాగర్ కాల్వలో సోమవారం మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం... గరిడేపల్లి మండలంలోని వెలిదండ గ్రామంలో ఆదివారం ఓ వివాహానికి హాజరైన హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చిమల్ల వెంకట్(21) సాగర్ కాల్వలో ఈతకు దిగి ప్రమాదవశాత్తు కొట్టుకుపోయాడు. సోమవారం ఉదయం పోలేనిగూడెం పరిధిలోని అగ్రికల్చర్ కళాశాల సమీపంలో సాగర్ కాల్వలో వెంకట్ మృతదేహం తేలియాడడంతో గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటికి తీసి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

పొలంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని ప్రశాంతిపూరితండా హైవే సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంతిపూరి తండాకు చెందిన కేతావత్ చంద్ వ్యవసాయ పొలంలో ఎలాంటి గాయాలు లేకుండా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహంపై కుడి చేతిపై యాదవ్(జేఈ) అనే టాటూస్ ఉందని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక రైతు
- రైలుకింద పడి యువకుడు
- పురుగుల మందు తాగి వివాహిత

నాగార్జునసాగర్, భువనగిరి రూరల్, అడ్డగూడూరు, ఆగస్టు 12: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. అప్పుల బాధతాళలేక నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాలో రైతు, యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన యువకుడు, అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది.

అప్పులు చేసి బోర్లు వేసి..



కృష్ణ(ఫైల్)

నల్లగొండ జిల్లా పెద్దవూర మండల పరిధిలోని చింతపల్లితండాకు చెందిన జటావత్ కృష్ణ(40) తనకున్న 10ఎకరాల్లో పత్తి, మిర్చి పంటలతో పాటు బత్తాయి తోట పెట్టాడు. బత్తాయి తోట ఎండిపోతుండడంతో ఎనిమిది బోర్లు వేయించాడు. వ్యవసాయం, బోర్లు వేయించేందుకు సుమారు రూ.10లక్షల వరకు అప్పులు చేశాడు. బోర్లు పడక పోగా తోట ఎండిపోయే దశకు వచ్చింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలని కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉన్న కృష్ణ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లాడు. మండల పరిధిలో పెద్దగూడెం స్టేజీ సమీపంలో పురుగుల మందు తాగి పడుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. చికిత్సనిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. కృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నాన్న.. తమ్ముడిని మంచిగా చూసుకో..



మధు(ఫైల్)

భువనగిరి మునిసిపల్ పరిధిలోని రాయిగిరికి చెందిన లస్కర్ మధు(27) రెవెన్యూ అడిషినల్ కలెక్టర్ వద్ద ఔట్‌సోర్సింగ్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరు కాలేదు. సాయంత్రం రాయిగిరి రైల్వే స్టేషన్ సమీపంలో తన ద్విచక్ర వాహనాన్ని రైలు పట్టాల సమీపంలో నిలిపివేసి సెల్‌ఫోన్‌ను, రూ.200 నోట్‌ను బైక్ ముందు కవర్‌లో పెట్టి సికింద్రాబాద్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు వెళ్తున్న భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలం వద్ద బైక్ కవర్ లోపల ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి ఆచూకీ కనుగొని మధు తండ్రి రాజుకు సమాచారం ఇచ్చారు. లభ్యమైన రూ.200 నోట్‌పై అన్నయ్య అమ్మ, నాన్న, తమ్ముడిని మంచిగా చూసుకో.. ఐ మిస్.. ఐ లవ్ మై ఫ్యామిలీ .. నా వల్ల కావట్లేదు' అని రాసి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జె. కృష్ణారావు తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఇంట్లో ఉంచిన పురుగుల మందు తాగి..



కవిత(ఫైల్)

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన భాషబోయిన యాదగిరి, అతని భార్య కవిత(30) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం పత్తి చేనుకు పురుగుల మందు కొట్టాలని యాదగిరి పురుగుల మందుల తెచ్చి ఇంటి లోపల పెట్టి బయటికి వెళ్లాడు. కవిత ఆ పురుగుల మందు తాగింది. స్థానికులు గమనించి యాదగిరికి సమాచారం ఇచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం తిరుమలగిరి మండలంలోని ఓ ప్రైవేట్ అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కవిత సోదరుడు సోమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కారు అదుపుతప్పి లారీని ఢీకొని..

దామరచర్ల, ఆగస్టు 12: కారు అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలోని వీరభద్రాపురంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సోమవారం జరిగింది. ఎస్ఐ ఇరుగు రవి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన ఆదిపూడి శ్రీనాథ్(40) స్థానికంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సింధు పిల్లలతో కలిసి గుంటూరులో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం విధులు ముగించుకున్న శ్రీనాథ్ రెండు రోజులు సెలవు కావడంతో గుంటూరులోని భార్య వద్దకు వెళ్లాడు. సోమవారం ఉదయం కారులో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. వాహనం వేగంగా వెళ్తున్న క్రమంలో దామరచర్ల మండలకేంద్రంలోని వీరభద్రాపురం నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రాంగ్‌రూట్‌లోకి వెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనాథ్ భార్య సింధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనాథ్‌కు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గొర్రెలు మేపుతుండగా..

మిర్యాలగూడ అర్బన్: రైలు ప్రమాదంలో గొర్రెల కాపరి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మిర్యాలగూడ మండలం రాఘవాపురంతండాకు చెందిన రమావత్ పాండ్య(65) గొర్రెల కాపరిగా వెళ్లాడు. పాండ్య చెవుడు ఉన్నట్లు తండావాసులు తెలిపారు. రైలుపట్టాల సమీపంలో 112/18 మైలురాయి వద్ద గొర్రెలు మేపుతుండగా కొన్ని జీవాలు రైలుపట్టాలపైకి వెళ్లాయి. వాటిని పక్కకు తప్పించేందుకు రైలుపట్టాలపైకి వెళ్లిన కాపరి పాండ్య చెవుడుతో సికింద్రాబాద్ నుంచి శబరి వైపు వెళ్తున్న 17230 నెంబరుగల రైలు శబ్దాన్ని గ్రహించలేకపోయాడు. అప్పటికే వేగంగా దగ్గరకు దూసుకొచ్చిన రైలు నుంచి తప్పించుకునే క్రమంలో ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పాండ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పాండ్య కుమారుడు రమావత్ మగ్గా ఫిర్యాదు మేరకు నల్లగొండ జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

77 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం చిత్తాపురం గ్రామ శివారులోని ఓ షెడ్డులో నిల్వ చేసిన 52 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. భువనగిరి మండలం పచ్చర్లబోడుతండాకు చెందిన ధరావత్ మహేందర్ వలిగొండ మండలంలోని చిత్తాపురం గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి 52క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. మహేందర్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ షేక్‌గౌస్, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ బాలమణి పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 25క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో దాడి చేశారు. కాలనీకి చెందిన రమణ ఓ రహస్య ప్రదేశంలో అద్దెకు తీసుకున్న షెడ్డులో రేషన్ బియ్యం డంపుచేసి ఇతర ప్రాంతానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధమవుతుండగా విశ్వసనీయ సమాచారం తనిఖీలు జరిపినట్లు పోలీసులు తెలిపారు. తనిఖీలు జరిపి నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకొని నిందితుడిపై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సుధాకర్ తెలిపారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నార్కట్‌పల్లి, ఆగస్టు 12: కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన అక్కా చెల్లెళ్లు ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. ఈ నెల 11, 12వ తేదీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో విక్టరీ షొటోకాన్ 12వ జాతీయ స్థాయి కరాటే ఛాంపి యన్ షిప్ పోటీలు జరిగాయి. కుమితేలో అండర్-14 బాలికల విభాగం 38 కేజీల కేటగిరీలో మండలంలోని బీ.వెల్లెంల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దాసోజు సౌమ్య బంగారు పతకం సాధించింది. అండర్-17 బాలికల విభాగం సీనియర్ లేవల్ కటాస్‌లో సౌమ్య సోదరి ఇదే పాఠశాల పూర్వ విద్యార్థిని దాసోజు సంజన కూడా ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించినట్లు జిల్లా కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ దాసోజు నర్సింహ్మాచారి తెలిపారు. పతకాలు సాధించిన అక్కా చెల్లెళ్లను పలువురు అభినందించారు.

విద్యార్థులకు బంగారు పతకాలు



మోత్కూరు: హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో మోత్కూరు మండలం దాచారం విద్యార్థులు ప్రతిభ చాటి పలు విభాగాల్లో పది బంగారు పతకాలు సాధించారు. ఈ పోటీల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి సుమారు 1500 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. కటా విభాగంలో సిహెచ్. అభిరామ్, ఎల్.హర్షిత, సిహెచ్. చరణ్‌తేజ్, ఫైట్ విభాగంలో సిహెచ్.అభిరామ్, సిహెచ్.చరణ్‌తేజ్ బంగారు పతకాలు, కటా విభాగంలో ఎం. కార్తీక్ రజత పతకం, బి. నిఖిల, ఎం. మణిదీప్, సిహెచ్. రాజు, సిహెచ్. చరణ్ సిల్వర్ పతకాలు సాధించారని కరాటే కోచ్ డాక్టర్ వేముల సైదులు తెలిపారు. ఆయనను బెస్ట్ కోచ్ అవార్డుతో సన్మానించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని మొరిపిరాల గ్రామపంచాయతీ మదిరె పొలిమెరాజులబావి గ్రామంలో నిమ్మల దశరథ అనే రైతుకు చెందిన కాడి ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందింది. సదరు రైతు తన పత్తి చేనులో గుంటుక తోలడానికి నాగలితో కూడిన ఎడ్లను పక్క రైతు పొలంలో నుంచి తోలుకొని వెళ్తుండగా కర్రలపై వేలాడుతున్న కరెంట్ తీగలు ప్రమాదవశాత్తు ఎడ్లకు తగలగా గమనించిన రైతు వెంటనే తన చేతి కర్రతో తీగలపై కొట్టాడు. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు తప్పించుకోగ రెండవ ఎద్దు విద్యుదాఘాతంతో అక్కడేపడి మృతిచెందినట్లు బాధిత రైతు వాపోయాడు. ఎద్దు విలువ సుమారు రూ. 85వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధం



తిప్పర్తి, ఆగస్టు 12: గ్యాస్ లీకై వ్యాన్ దగ్ధమైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామ సమీపంలో సోమ వారం జరిగింది. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన సుంకరబోయిన రమేష్ స్కూల్ పిల్లలను తీసుకెళ్లడానికి గత సంవత్సరం సెకండ్ హ్యాండ్ మారుతి ఓమ్ని వ్యాన్‌ను కొనుగోలు చేశాడు. కొన్ని రోజులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లేందుకు ఉపయోగించాడు. వాహనం మరమ్మతులకు గురికా వడంతో అక్కడ మానేసి నల్లగొండలోని ఓ గ్యారేజ్‌లో రిపేర్ చేసుకొని వస్తున్నాడు. తిప్పర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా వాహనం ఆగిపోయింది. పొగలు రావడంతో భయాందోళనకు గురైన రమేష్ వాహనం దిగి పక్కకు వెళ్లాడు. పెద్ద ఎత్తున మంట రావడంతో 100కు డయల్ చేయగా అక్కడికి చేరుకున్న పోలీసులు నల్లగొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేశారు. ఈ ప్రమాదానికి వాహనంలో గ్యాస్ లీకేజీనే కారణమని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో వాహనంలో ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చర్చించుకుంటున్నారు.

ఏడు గొర్రె పొటేళ్ల చోరీ

తుర్కపల్లి, ఆగస్టు 12: యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం బీల్యానాయక్‌తండాలో భూక్య లచ్చిరాంనాయక్‌కు చెందిన ఏడు గొర్రె పోటేళ్లను ఆదివారం అర్ధరాత్రి గుర్తు లెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బాధిత రైతుకు రూ.1.20లక్షలు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన లచ్చిరాంనాయక్ తన గొర్రెలను పొద్దంతా అడవిలో మేపి సాయంత్రం తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన గొర్రెల పాకలో గొర్రెలన్నింటినీ ఉంచి ఇంటికి వచ్చాడు. సోమవారం తెల్లవారుజామున మంద వద్దకు వచ్చి చూసే సరిక మందలో ఏడు గొర్రె పొటేళ్లు లేవనే విషయాన్ని గుర్తించాడు. వాటి ఆచూకీ కోసం పరిసరాలు వెతికినా దొరకలేదని తెలిపాడు. తన గొర్రె పొటేళ్లను దొంగలే ఎత్తుకెళ్లారని, దీంతో తనకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

గీత కార్మికుడికి గాయాలు

అడ్డగూడూరు, ఆగస్టు 12: తాటిచెట్టుపై నుంచిపడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చిన్నపడిశాల గ్రామంలో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబటి చిన్న యాదయ్య రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కిందికి దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావ డంతో యాదయ్యను చికిత్సనిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

శాలిగౌరారం, ఆగస్టు 12: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామ శివారులో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగాయి. గుర్తుతెలియని వ్యక్తులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామస్థులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ డి. సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తలూరు గ్రామ శివారులో అంబారిపేట వెళ్లే దారిలో బోయనపెల్లి సోమేశ్వరరావు భూమిలో ఉన్న పురాతన గౌడ కుల దైవం కాటమయ్య గుడిలో ఆదివారం రాత్రి తవ్వకాలు జరిగాయి. దుండగులు రాతి విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన శంకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎరుకుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా వీరన్న


నియామకపత్రం అందుకుంటున్న నల్లగొండ వీరన్న

సూర్యాపేట టౌన్, ఆగస్టు 12: తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన నల్లగొండ వీరన్నను నియమించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో వీరన్నకు నియామకపత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు శ్రీరాం సదానందం, రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు అందజేశారు. ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ ఎరుకుల కులస్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు ఎరుకుల కులస్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నర్సింహ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతడి రవికుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కిశోర్‌కుమార్‌కు ఇండియన్ ఐకాన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న కిశోర్‌కుమార్

సూర్యాపేటఅర్బన్, ఆగస్టు 12: జిల్లా కేంద్రానికి చెందిన ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ పల్లె కిశోర్‌కుమార్ ఇండియన్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. సోమవారం రాజమండ్రిలో ఫిలాంత్రోపిక్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళా రంగంలో చేసిన సేవ లకు కిషోర్ కుమార్‌కు అవార్డును ఏపీ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అందజే శారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ ఇలాంటి అవార్డులతో బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుబ్బల రాంబాబు, ఆశ్రిత, జ్యోతి, కత్తిమండ ప్రతాప్, కళాకారులు పాల్గొన్నారు.

దయాకర్‌గుప్తాకు సేవా వైభవ రత్న..


సేవా వైభవరత్న అవార్డు అందుకున్న ఈగ దయాకర్‌గుప్తా

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 12: ఆధ్యాత్మిక, సామాజిక సేవకుడు జిల్లా కేంద్రానికి చెందిన ఈగ దయాకర్ గుప్తాకు సేవా వైభవ రత్న అవార్డు లభించింది. దయాకర్ గుప్తాకు సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో శ్రీలలిత కళాసమాఖ్య నిర్వాహకుడు మహేంద్రవాడ వెంకటేశ్వర్‌రావు ఈ అవార్డు ఇవ్వడంతో పాటు స్వర్ణ కంకణం తొడిగి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దాయకర్‌గుప్తా మాట్లా డుతూ ఎంతోమంది నిరుపేద మహిళల వివాహాలను సొంత ఖర్చులతో మంగళసూత్రాలు అందజేశానన్నారు. ఈ అవార్డుతో తనపై సామాజిక బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఉమారాణి మృతి బాధాకరం: మంత్రి

హుజూర్‌నగర్, ఆగస్టు 12: కాంగ్రెస్ నాయకుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అల్లం ప్రభాకర్‌రెడ్డి భార్య ఉమారాణి మృతి బాధాకరమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఉమారాణి మృతదేహంపై మంత్రి ఉత్తమ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమారాణి ఉపాధ్యాయురాలిగా ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల అశ్రునయనాల మధ్య ఉమారాణి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతదేహంపై కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పెన్‌పహాడ్‌లో పారిశుధ్య పనులు చేయిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్, ఆగస్టు 12: పరిసరాల పరి శుభ్రత అందరి బాధ్యతని పెన్‌పహాడ్ పంచాయతీ కార్యదర్శి గోగుల నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా, దోమల ఉధృతిని అరికట్టేందుకు మురుగు కాల్వలు, వీధుల్లో స్ప్రే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లు రాలేదని అడ్డుగా గోడ

- ఎనిమిది నెలలుగా ఆగిన పంచాయతీ భవన పనులు
- నెల రోజుల క్రితం బిల్లు మంజూరైనా ప్రారంభించని కాంట్రాక్టర్


రాఘవపురం గ్రామ పంచాయతీ భవనానికి అడ్డుగా నిర్మించిన గోడ

తిరుమలగిరి రూరల్, ఆగస్టు 12: మండలంలోని రాఘవపురంలో పంచాయతీ భవన నిర్మాణ బిల్లులు మంజూరు కాలేదని భవనంలోకి వెళ్లడానికి అడ్డుగా గోడను కాంట్రాక్టర్ నిర్మించాడు. బిల్లులు రానందున ఎనిమిది నెలల క్రితం పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్, భవనంలోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుగా గోడను కట్టాడు. 45రోజుల క్రితం క్రితమే బిల్లు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాఘవాపురం గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధి నిధులు రూ. 20లక్షలు మంజూరయ్యాయి. ఆ భవనానికి రెండు గంటల స్థలం విరాళంగా ఇవ్వడంతో, భవనాన్ని కూడా తానే నిర్మిస్తానని అదే గ్రామానికి చెందిన సత్యనారాయణరెడ్డి ముందుకు వచ్చాడు. దీంతో ప్రభుత్వం సత్యనారాయణరెడ్డికి అనుమతి ఇచ్చింది. 2023 ఏప్రిల్ 23వ తేదీన భవన నిర్మాణ పనులను సత్యనారాయణరెడ్డి ప్రారంభించాడు. స్లాబ్ వేసి గోడలు నిర్మించి ఎనిమిది నెలలు గడిచినా బిల్లు రాకపోవడంతో నిర్మాణ పనులను మధ్యలోనే ఆపి వేయడంతో పాటు . భవన ముఖ ద్వారానికి అడ్డుగా గోడను నిర్మించాడు.

45 రోజుల క్రితమే బిల్లు వచ్చింది.

భవన నిర్మాణ బిల్లులు రానందున ఎనిమిది నెలల క్రితం పనులను నిలిపివేశాను. దీంతో పాటు భవనంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో భవనంలోకి ఎవరూ వెళ్లకుండా అడ్డుగా గోడను నిర్మించాను. నెలన్నర క్రితమే బిల్లు వచ్చింది. త్వరలో పనులను పూర్తి చేస్తా.

● సత్యనారాయణరెడ్డి, కాంట్రాక్టర్

కాంట్రాక్టర్‌ను మారుస్తాం

పంచాయతీ భవన నిర్మాణ పనులకు బిల్లు వచ్చి 45 రోజులైంది. అదే నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ఇంకా ప్రారంభించలేదు. కాంట్రాక్టర్‌ను త్వరలో మార్చి వేరేవారితో పనులు చేయిస్తాం

● శాంతయ్య, ప్రత్యేక అధికారి

లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలి


విద్యార్థిని సౌమ్యను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

కోదాడ టౌన్, ఆగస్టు 12: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతంగా ఎదగాలని కేఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.నిర్మలకుమారి అన్నారు. పీజీ సెట్‌లో బోటనీ సబ్జెక్టులో రెండో ర్యాంకు సాధించిన వి.సౌమ్యను సోమవారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. అనంతరం నిర్మలకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన ఉచిత విద్య లభిస్తుందని తెలిపారు. పోటీ పరీక్షల్లో విజేతలందరూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులేనని అన్నారు. విద్యార్థులు సామాజిక స్ఫూర్తితో ముందుకు సాగి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోటనీ అధ్యాపకుడు ఏ.రాజు, అధ్యాపకులు చందా అప్పారావు, బి. సైదిరెడ్డి, శ్రీలత, సత్యవాణి, మాతంగి యాకూబ్, ఫ్రాన్సిస్, సైదులు, ఎస్ఎం. రఫీ, టీ.రాజు, బి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి


కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 12: వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెమిడాల రాజు, ధూళిపాళ ధనుంజయ్ నాయుడు కోరారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కుపలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఏడాదికి రూ.12వేల చొప్పున అందించాలని, ఉపాధిహామీ పథకం పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, వ్యవసాయ కార్మికులను ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందచేసిన వారిలో సంఘం నాయకులు రావుల సత్యం, బూర వెంకటేశ్వర్లు, మీసాల శ్రీను, మహేష్, ఎడ్ల సైదులు, సత్యావతి, వెంకటమ్మ, సత్యం ఉన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం


పానుగోడులో ఆర్థికసాయం చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు కటకం వేణు

గరిడేపల్లి, ఆగస్టు 12: పేదలకు నిరంతరం అండగా కటకం జోగయ్య ఫౌండేషన్ ఉంటుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకుడు కటకం వేణు అన్నారు. పొనుగోడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన చిలక జానయ్య దశదిన కర్మలకు కటకం జోగయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేసి మాట్లాడారు. గ్రామంలోని నిరుపేదలకు కేజే ఫౌండేషన్ నిరంతరం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చామకూరి సుధాకర్, మన్నెం వేణు, సురేష్, సైదులు, నాగరాజు, మహేష్, కార్తీక్, గౌతమ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'కి అపూర్వ స్పందన


ప్రజావాణిలో పాల్గొన్న పెన్‌పహాడ్ మండల అధికారులు

పెన్‌పహాడ్, ఆగస్టు 12: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తుందని ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, తహసీల్దార్ ధరావత్ లాలునాయక్ తెలిపారు. ప్రజావాణిలో జిల్లాలో పలు ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులు సంజీవయ్య, కృష్ణసందీప్, రవి, అజయ్‌నాయక్, హనీపా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి


మద్దిరాల ప్రభుత్వ పాఠశాల్లో పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

మద్దిరాల, ఆగస్టు 12: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారాని పీఆర్‌టీయూటీఎస్ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని చిననెమిల, పోలుమళ్ల, ముకుందాపురం, మామిళ్లమడవ, గోరెంట్ల, మద్దిరాల, కుక్కడం, రెడ్డిగూడెం గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, మహేశ్వరం వెంకటయ్య, మేడిపల్లి శ్రీనివాస్, శివశంకర్, గోదేషి దయాకర్, విష్ణుకుమార్, కడారి సతీష్, నెమ్మాని కోటేశ్వర్‌రావు, గంజి శంకర్, పొదిల రవీందర్, సయ్యద్ జహీర్, భూక్య శంకర్‌నాయక్, కామళ్ల మురళి, బాణాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి'

భానుపురి, ఆగస్టు 12: సూర్యాపేట ఆర్ఎంపీ, పీఎంపీ 12వ మహాసభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గూకంటి రాజబాబురెడ్డి తెలిపారు. సోమవారం సూర్యాపేటలో ఆయన మాట్లాడారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జీవీవీ ఫంక్షన్‌హాల్‌లో 12వ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు.

'సీపీఎస్‌ను రద్దు చేయాలి'

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 12: సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను కొనసాగిస్తు ఆగస్టు 23న విడుదల చేసిన జీవో నెం.28ని ప్రతులన దహనం చేసి, ఆ రోజును బ్లాక్‌డేగా పాటించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబరు ఒకటో తేదీ వరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తామన్నారు.

ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

భానుపురి, ఆగస్టు 12: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్స్ ద్వారా మెయిన్స్‌కు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి శంకర్‌నాయక్ తెలిపారు. మెంటర్ గైడెన్స్‌తో పాటు, ఒక ట్యాబ్, ఉచిత భోజన వసతి కల్పించి శిక్షణ ఇస్తారన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట కల్చరల్, ఆగస్టు 12: జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం రోడ్డులోని శ్రీభక్తాంజనేయస్వామి దేవాలయానికి నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు హైదరాబాద్‌లోని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు దేవాలయ ఇన్‌చార్జి ఈవో ఎంపీ లక్ష్మణ్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 20రోజుల్లో హైదరాబాద్/నల్లగొండలోని దేవాదాయ, ధర్మాదాయ కార్యాలయాల్లో దరఖాస్తు చేయాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు దేవాలయ ఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మేళ్లచెర్వు: చింతలపాలెం మండలంలోని ఆలయాల ధర్మకర్తల నియామకానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. చింతలపాలెం మండల కేంద్రంలోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానం, మండలంలోని వెల్లటూరు గ్రామంలోని చెన్నకేశవ స్వామి దేవాలయాలకు నూతన ధర్మకర్తల, నియామకానికి దేవాదాయ ధర్మదాయ శాఖ నోటీసు విడుదల చేసిందని ఆలయాల ఈవో లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 22వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

మఠంపల్లి: మండలంలోని చౌటపల్లి గ్రామంలోనివేణుగోపాల స్వామి ఆలయ నూతన పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో ఎంపీ లక్ష్మణరావు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 20రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం


ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ

కోదాడ టౌన్, ఆగస్టు 12: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని కోదాడ బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం డి.మార్కండేయ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థినీవిద్యార్థులకు ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహించనున్న క్రీడా పోటీలను సోమవారం పాఠశాల మైదానంలో ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, రన్నింగ్, జంపింగ్, మ్యూజికల్ చైర్, తాడాట, స్పూన్ రేస్, తదితర ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఆటల పోటీల నిర్వహణ కమిటీ సభ్యులు పీడీ నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, జానకిరామ్, షేక్ ఖాజామియా, నరసమ్మ, పద్మావతి, మీనాక్షి, రాణి, వీరబ్రహ్మచారి, చిన్నప్ప, సురేష్, దేవరాజు, బి.సైదులు, ముక్తార్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విష జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఇమాం

నడిగూడెం, ఆగస్టు 12: ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఎస్‌డీ ఇమాం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాలను సందర్శించినప్పుడు ప్రజలు సహకరించాలన్నారు. మండల వ్యాప్తంగా విష జ్వరాలు సోకకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు లక్ష్మీప్రసన్న, విద్యాసాగర్, హరినాథ్, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటలను నమోదు చేయించాలి


అడివెంల గ్రామంలో పంట నమోదులో పాల్గొన్న రైతులు

అర్వపల్లి, ఆగస్టు 12: వానాకాలం పంటల నమోదును ప్రతి రైతూ చేయించాలని ఏఈవో ఎన్.సత్యం కోరారు. సోమవారం జాజిరెడ్డిగూడెం మండలం అడివెంల గ్రామంలో క్షేత్ర స్థాయి పంటల నమోదును రైతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో మేడబోయిన రామస్వామి, రైతులు యాదగిరి, పిట్టల సైదులు, అంజయ్య పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు నడపాలి


మద్దిరాలలో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు


మద్దిరాల, ఆగస్టు 12: ఆర్టీసీ బస్సులు సకాలంలో రానందున ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మద్దిరాల మండల కేంద్రం నాలుగు రోడ్ల కూడలిలో ఉంది. మద్దిరాల మండల కేంద్రం మీదుగా 365 జాతీయ రహదారి ఉంది. మండల కేంద్రం నుంచి ప్రయాణికులు వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు నిత్యం వెళుతుంటారు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం గంటల తరబడి నిలబడుతున్నా, కొన్ని బస్సులు గ్రామాల స్టేజీల వద్ద ఆపడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. చిన్న పిల్లలతో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నామని, కనీసం బాత్‌రూం కూడా లేనందున ఇబ్బంది పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌లో కనీస వసతులు లేనందున ఉపయోగపడటం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ బస్‌లను సకాలంలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పబ్లిక్ డిమాండ్
PUBLIC DEMAND

గ్రామ దేవతల పండుగలు నిర్వహించడానికి పంచాయతీల్లో నిధుల కొరత ఏర్పడింది. గతంలో సర్పంచ్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించే వారు. ప్రస్తుతం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున గ్రామాల్లో బోనాల పండుగను నిర్వహించడానికి ఎవరూ ముందుకురావడంలేదు. ప్రభుత్వం స్పందించి బోనాలు పండుగకు నిధులు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

- పెన్‌పహాడ్

పొంచి ఉన్న ప్రమాదం


చౌటపల్లి బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్న స్తంభం

మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామ శివారులోని బైపాస్ రోడ్డులో 132 కేవీ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈ స్తంభం ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

● మఠంపల్లి